# నాటో కూటమికి మిత్రదేశంగా వుండే స్థితి-ఇండియాపై బిగిస్తున్న ఉచ్చు

**2019** జూన్ నెలాఖరులో అమెరికా సెనేటు 'నేషనల్ ఆథరైజేషన్ బిల్లు-2020'ని ఆమోదించింది. దీని ప్రకారం నాటో కూటమికి భారతదేశం మిత్రదేశంగా వుంటుంది. అమెరికా కాంగ్రెసులోని రెండు సభలూ దీనిని పాస్ చేస్తే ఇక అది చట్టరూపం దాల్చుతుంది.

స్వతంత్ర, సర్వసత్తాక, ప్రజాస్వామిక దేశంగా ప్రకటించుకుంటున్న ఇండియా లాంటి దేశానికి నాటోకి మిత్రునిగా వుండే స్థితి ఏమంత గౌరవాన్ని కలిగించదు. నిజంగా ఇది మన దేశానికి, మన ప్రజలకు అవమానకరమైనది, హానికరమైనది.

నాటో అనేది అమెరికా సామ్రాజ్యవాద నాయకత్వానగల మిలటరీ కూటమి. దానిలో సభ్యత్వం కలిగినవి సామ్రాజ్యవాద దేశాలుగానూ, సామ్రాజ్యవాదానికి ఊడిగం చేసే దేశాలుగానూ వున్నాయి. నాటో కూటమిలోని ఒక సభ్యదేశంపై దాడి జరిగితే, దానిని నాటో సభ్యదేశాలన్నింటిపై దాడిగా చూడాలని, అన్నీ కలిసి ఆ ఉమ్మడి శత్రువును ఎదుర్కోవాలనేది నాటో స్థాపక నియమం. సోషలిస్టు సోవియట్ యూనియన్ నుండి ప్రమాదం పొంచివుందనే ఊహాజనిత వాదనలతో దానినుండి తమను కాపాడు కోవటానికని 1949లో నాటో ఏర్పాటును సామ్రాజ్యవాదులు సమర్ధించుకున్నారు. కానీ నాటో సామ్రాజ్యవాదపు అత్యంత భయంకర వికృతరూపంగా ఎదిగింది. గత ఏడు దశాబ్దాలుగా మానవత్వానికి వ్యతిరేకంగా అది చేయని నేరం లేదు. అమెరికా నాయకత్వానగల నాటో శక్తులు వివిధ దేశాల, ప్రజల హక్కులను హరించి వేశాయి. ఉగ్రవాదంపై పోరు పేరుతో, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పేరుతో, మారణా యుధాలు కలిగి వున్నారనే ఆరోపణలతో అవి అనేక దేశాల్లో సాయుధ దాడులకు, సాయుధ చొరబాట్లకు పాల్పడ్డాయి. ఆఫ్ఘనిస్తాన్‌లోను, ఇరాక్‌లోను వారి సాయుధ చొరబాట్లు, దాడులు గత రెండు దశాబ్దాల్లో అత్యంత తీవ్రమైనవిగా వున్నాయి.

చిన్న దేశాల అభివృద్ధికి సహాయపడే పేరిట అప్పులను, పెట్టుబడులను, వస్తువులను, ఇతర సహాయాలను ఆయా దేశాల్లో కుమ్మరించటం; రెండు దేశాల మధ్యగల వివాదాల్లో తీర్పరిగా తలదూర్చటం; సమస్యలను మరింత పెద్దవి చేయటం, వ్యతిరేకతలను, ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టటం, యుద్ధాలను- యుద్ధవాతావరణాన్ని రెచ్చగొట్టటం; ఆ వివాదాల నుండి తన ఆయుధాలను ఆయా దేశాలకు అమ్మి సూపర్ లాభాలను కొల్లగొట్టటం; ఇతర దేశాల్లో మిలటరీ స్థావరాలను ఏర్పరచటం; శాంతి పేరిట, భద్రత పేరిట ఆయా దేశాలను మిలటరీ ఒప్పందాల్లోకి లాగటం అవేవి చిన్నదేశాలను, బలహీన దేశాలను నిస్సిగ్గుగా లోబరచు కోవటానికి సామ్రాజ్యవాదశక్తులు, ముఖ్యంగా అమెరికా అనుసరిస్తున్న విధానాలు. ఇండియా వంటి అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశం, దళారీ బూర్జువా భూస్వామ్యశక్తులు పాలకవర్గాలుగా ఉన్న దేశం సామ్రాజ్యవాద దేశాలకు తమ దోపిడీ విధానాలను కొనసాగించటానికి, అణచివేతను, ఆధిక్యతను కొనసాగించటానికి అనువైనదిగా వుంది.

ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలతో సామ్రాజ్యవాదశక్తులు, ముఖ్యంగా అమెరికా భారతదేశంలో తమ ఆర్థిక, రాజకీయ, మిలటరీ పట్టును మరింత బిగించాయి. ప్రతి క్లిష్ట సందర్భాన్ని, సంక్షోభాన్ని అందుకు వాడుకున్నాయి. ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య వివాదాన్ని రెండు దేశాలకు ఆయుధాలు సరఫరా చేయటానికి వినియోగించు కున్నాయి. భారత పాలకవర్గాల అనేక లొంగుబాటు ఒప్పందాలను తమతో చేసుకునే విధంగా నిర్దేశించాయి.

ఇందులో భాగంగానే యుపిఏ-1 ప్రభుత్వం 2005లో 'భారత్-అమెరికా రక్షణ ఒప్పందం'పై సంతకం చేసింది. దీనితో ఇండియా అమెరికా మిలటరీ సంబంధాలు కొత్త పుంతలు తొక్కాయి. కాంగ్రెసు పరిపాలన సాగిన బాటలోనే నరేంద్రమోడీ నాయకత్వాన బిజెపి ప్రభుత్వం మరింత ముందుకు పోయింది. 2015లో ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ఒబామా 'ది జాయింట్ విజన్ స్టేట్‌మెంట్ ఫర్ ఆసియా -పసిఫిక్' ఒప్పందంపై సంతకాలు చేశారు. 2016లో అమెరికా ఇండియాకు 'ప్రధాన రక్షణ భాగస్వామి హోదానిచ్చాంది. 'లాజిస్టిక్ ఎక్స్ఛేంజి మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్' (ఎల్ఇఎంఎ) పై కూడా 2016లో సంతకాలు జరిగాయి. 2018లో రెండు దేశాలు 'కమ్యూనికేషన్ కంపాటబివిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్' పై సంతకాలు చేశాయి. ఇది అమెరికా ఆధిపత్యం క్రింద ఇండియా మిలటరీ వ్యవహారాలలో వారికి మిత్రదేశంగా మారింది.

కనుక నాటో మిత్రదేశం అని ఇండియాను పైకెత్తటం ఏమంత ఆశ్చర్యార్ధక చర్యమే కాదు. భారత దళారీ పాలక వర్గాలు, అమెరికా దశాబ్దాల తరబడి సాగించిన అనేక దుర్మార్గమైన చర్యలకు ఇది ఒక పరాకాష్ట. ఈ చర్యలన్నీ భారత ప్రజానీకానికి తెలియకుండా, వారి అనుమతి లేకుండా తీసుకోబడుతున్నాయి. అవి చాలా స్పష్టంగా మన దేశాన్ని, మన ప్రజలను వంచించేవి. బ్రిటీషు వలస పాలకుల కబంధ హస్తాల నుండి భారతదేశాన్ని విముక్తి చేయటానికి, సార్వభౌమత్వంతో కూడిన ప్రజాస్వామిక దేశం కోసం ఎంతోమంది ప్రజానీకం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారు. మరల ఈ దేశాన్ని సామ్రాజ్యవాదులకు వలసగా, సామంతదేశంగా, మిత్రదేశంగా, సాధనంగా వుండటాన్ని వారెంత మాత్రము అంగీకరించరు.

బిజెపి, సంఘ్‌పరివార్‌లు తమను తాము జాతీయవాదులుగా ప్రకటించుకుంటూ, వారి కుహనా జాతీయవాదాన్ని ఎత్తిచూపిన వారిని శిక్షించే దూకుడును ప్రదర్శిస్తున్నాయి. వారు హిందూత్వ లేక హిందూ జాతీయవాదం అనే నినాదాలను పదేపదే వల్లెవేయటం ప్రజలను పక్కదారి పట్టించడానికి, విభజించటానికి, ఇంకా సామ్రాజ్యవాదానికి అత్యంత దుర్మార్గంగా దాసోహమనటంతప్ప వేరొకటి కాదు. ప్రస్తుతం ప్రతిపక్షంలో వున్న మరో పాలకవర్గ పార్టీ కాంగ్రెసు బిజెపితోను, సంఘపరివార్‌తోను రాజీలేని సైద్ధాంతిక పోరాటం సాగిస్తున్నట్లు చెప్పుకుంటున్నది. అది ప్రజాస్వామ్యం గురించి, ప్రజల ప్రజాస్వామిక హక్కుల గురించి ఎక్కువగా మాట్లాడుతూ వుంటుంది. కానీ, భారతదేశంలో సామ్రాజ్యవాదంయొక్క చొరబాటును గురించి కానీ, దాని ఆధిపత్యం గురించిగానీ వ్యతిరేకించదు, అది దాని సైద్ధాంతిక పోరాటంలో భాగంగా లేనేలేదు. ఎందుకంటే భారతదేశం ఇప్పుడింతగా సామ్రాజ్యవాదానికి దాసోహమనటానికి కాంగ్రెసు పార్టీ పోషించిన పాత్ర చిన్నదేమీ కాదని దానికి తెలుసు., అది ఎల్లప్పుడూ సామ్రాజ్యవాదానికి అణుకువగా వుండేదే. ఒకవైపు సామ్రాజ్య వాదానికి గేట్లు బార్లా తెరిచి వుంచుతుంటే, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనటం విడ్డూరం.

కనుక నాటోకు మిత్రదేశంగా ఇండియా వుండటానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు విప్లవకారులు, వామపక్ష ప్రజాతంత్రశక్తులు నిరసన తెలియజేయాలి. సామ్రాజ్యవాదానికి దాసోహపడుతూ భారత పాలకులు చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దుచేయాలని డిమాండు చేయాలి